

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

గురువారం 4 జనవరి 2024 | 5

అయోధ్యకు రత్నగిరి మట్టి, నీరు

పవన్ కాకినాడ పర్యటన వాయిదా

గడ్డి మందు తాగి విద్యార్థి మృతి

చెట్టును ఢీకొని సర్వేయర్ మృతి

జనం జంప్



సీఎం జగన్ మాట్లాడుతుండగా ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సీఎం జగన్ ప్రసంగం మధ్యలోనే వెళ్లిపోతున్న జనం

సీఎం హామీలు నెరవేర్చాలంటూ వర్మ ధర్నా



సీఎం ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ పిఠాపురంలో ధర్నా నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

- సీఎం కాకినాడ పర్యటన అట్టర్ ఫ్లాప్
- సభలో సగానికిపైగా కుర్చీలన్నీ ఖాళీ: ఉదయం నుంచే కూర్చోబెట్టడంతో విసుగెత్తిన జనం
- వెళ్లొద్దంటూ పోలీసులు, అధికారులు, వైసీపీ నేతలు బెదిరించినా ఆగని ప్రజలు
- సీఎంకు వినతిపత్రాలు ఇవ్వడానికి వచ్చిన వారిని అడ్డగించిన పోలీసులు
- టికెట్ నిరాకరించడంతో సీఎంకు ముఖం చాటేసిన ఎమ్మెల్యేలు చంటిబాబు, చిట్టిబాబు
- మంత్రి వేణు, ఎంపీ బోస్ ఎడముఖం, పెడముఖం
- కనీసం పలకరించుకోని మంత్రి దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యే ద్వారంపూడి

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడలో బుధవారం సీఎం జగన్ అట్టర్‌ఫ్లాప్ అయింది. అధికారం అండతో అడ్డగోలుగా జనాలను బెదిరించి భయపెట్టి జనాన్ని తరలించినా సభ ఫెయిల్ అయింది. సీఎం సభకు వచ్చినవారంతా మధ్యలోనే వెళ్లిపోయారు. సామాజిక పింఛను పెంపు సభను కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ మైదానంలో నిర్వహించారు. సీఎం జగన్ ప్రసంగం ప్రారంభించగానే ఒక్కసారిగా అందరూ లేచి వెళ్లిపోయారు. జనం ప్రభుత్వం తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉదయం 6గంటలకు తీసుకువచ్చి సభలో వదిలేశారని, ఆకలితో అలమటించిపోయామని పేర్కొన్నారు. కొందరైతే కిలోమీటర్ల దూరంలో బస్సులు ఆపేసి తమను నడిపించారని చెప్పారు. సాధారణంగా భారీ బహిరంగ సభల్లో ముఖ్యమంత్రి ప్రసంగం పూర్తయిన తర్వాత జనం బయటకు రావడానికి గంటకుపైగా సమయం పడుతుంది. కానీ సభ పూర్తయిన తర్వాత పావుగంటకే మొత్తం ప్రాంగణం ఖాళీ అయిపోయింది. దీంతో కష్టపడి అధికారులు 318 ఆర్టీసీ బస్సులు, వందల్లో ప్రైవేటుస్కూళ్ల బస్సులు, ఆటోలు పురమాయించి జనాలను తీసుకువచ్చినా ఉపయోగం లేకుండా పోయింది. సభ పూర్తయిన తర్వాత జగన్ సమీపంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు తిరుగు పయనమయ్యారు. ఈలోపు జనం వినతిపత్రాలతో జగన్‌ను కలవడానికి ప్రయత్నించారు. కానీ పోలీసులు వీరిని నిలిపివేయడంతో వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు.

దూరం దూరం..

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటమి భయంతో వైసీపీ మంగళవారం రాత్రి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు మార్పులు చేసింది. ప్రత్తిపాడు, జగ్గంపేట, పిఠాపురం, పి.గన్నవరం ఎమ్మెల్యేలకు టిక్కెట్‌లు నిరాకరించింది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకుండా పక్కనపెట్టింది. ఈ నేపథ్యంలో టిక్కెట్‌లు కోల్పోయిన ఎమ్మెల్యేలు బుధవారం నాటి సీఎం జగన్ పర్యటనకు ముఖం చాటేశారు. తమ రాజకీయ భవిష్యత్తును చిదిమేశారనే ఆగ్రహంతో జగన్‌కు దూరంగా ఉన్నారు. ప్రధానంగా జగ్గంపేట వైసీపీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఇద్దరూ సీఎం పర్యటనకు రాలేదు. దీంతో వీరి గైర్హాజరుపై చర్చ జరిగింది. ఇప్పటికే చంటిబాబు పవన్‌ను కలవడంతో ఆయన దారి ఎటు అనేది తేలిపోయింది. అటు చిట్టిబాబు గన్నవరంలోనే ఉన్నా రాలేదు. టిక్కెట్‌లు పోయిన ప్రత్తిపాడు, పిఠాపురం ఎమ్మెల్యేలు పర్వత ప్రసాద్, పెండెం దొరబాబు దీనంగా కనిపించారు. సీఎం వద్దకు వెళ్లి కాసేపు పలకరించారు. వీరిస్థానంలో టిక్కెట్‌లు దక్కించుకున్న వరుపుల సుబ్బారావు సభకు వచ్చినా పర్వతవైపు కన్నెత్తి కూడా చూడలేదు. అటు వంగా గీతతోను దొరబాబు పెద్దగా సఖ్యతగా కనిపించలేదు. ఇదంతా ఒకెత్తయితే రామచంద్రపురం సీటునుంచి రెండోసారి బరిలోకి దిగాలని కలకన్న మంత్రి వేణు అక్కడ టిక్కెట్ దక్కకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు. ఈ సీటు ఎంపీ బోస్ తనయుడికి పార్టీ కట్టబెట్టిన సంగతి తెలిసింది. మంత్రి వేణు, ఎంపీ బోసు వేదికపై ఉన్నా ఒకరినొకరు పలకరించుకోలేదు. దూరం దూరంగానే కూర్చున్నారు. అటు మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి కూడా ఎడముఖం పెడముఖంగా ఉన్నారు. ఒకరకంగా చెప్పాలంటే సీఎం పర్యటన సాక్షిగా వైసీపీలో విభేదాలు స్పష్టంగా బయటపడ్డాయి. సభలో ఎమ్మెల్యే ద్వారంపూడి జగన్‌ను ఎంత పొగిడే ప్రయత్నం చేసినా ఆయన పట్టించుకోలేదు. ద్వారంపూడి ప్రసంగిస్తున్నంతసేపూ మంత్రులు సీదిరి, రాజాతో మాట్లాడుతూనే ఉన్నారు. ప్రజలంతా నిల్చుని రెండు చేతులు పైకి చాచి జగన్‌ను ఆశీర్వదించాలని ద్వారంపూడి పిలుపునివ్వడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తెలుగు ప్రసంగం సభలో నవ్వులు పూయించింది. కాగా ఎమ్మెల్సీ అనంత బాబు సీఎం సభలో హల్‌చల్ చేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు ఎదుర్కొంటున్న ఈయన వైసీపీ సభల్లో హడావుడి చేస్తుండడం, సీఎం జగన్ కూడా ఆయన్ను పక్కనే పెట్టుకుని తిరుగుతుండడంపై దుమారం రేగింది. పింఛన్ల పెంపునకు సంబంధించిన ప్రభుత్వ కార్యక్రమంలో ఎక్కడికక్కడ వైసీపీ గీతాలను ఆలపించడం విమర్శలకు దారితీసింది. కాగా జగన్నాథపురంలో తాగునీటి వసతి మెరుగుపర్చడానికి రూ.57కోట్లు మంజూరు చేయాలని సీఎం జగన్‌ను ఎమ్మెల్యే ద్వారంపూడి కోరారు. సభ ప్రారంభానికి ముందు కాకినాడలో పలు అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలను సీఎం జగన్ ఆవిష్కరించారు.



సీఎం సభనుంచి వెళ్లిపోతున్న జనం

బెదిరింపులతో తరలింపు

సర్పవరం జంక్షన్, జనవరి 3: కాకినాడలో సామాజిక పింఛన్ల పెంపు సభలో సీఎం జగన్ ప్రసంగం ప్రారంభించిన కొద్దిసేపటికే సభాప్రాంగణంలో ఉన్న మహిళలు, పింఛన్ లబ్ధిదారులు బయటకు వచ్చేశారు. సీఎం సభకు తప్పకుండా హాజరు కావాలని, లేదంటే పింఛన్ ఇవ్వడం కుదరదని, అధికసంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు సభకు హాజరు కాకపోతే బ్యాంకు రుణాలు మంజూరు కాదని వలంటీర్లు, యానిమేటర్ల ద్వారా వైసీపీ నాయకులు ప్రజలను బెదిరించారు. దీంతో బలవంతంగా సభకు వచ్చామని పలువురు మహిళలు తెలిపారు. ఉదయం 6 గంటలకు బస్సు ఎక్కించారని, కేవలం వాటర్ ప్యాకెట్ ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం సభ పూర్తయ్యే సరికి భోజనం టైమ్ అయిందని, తమను తీసుకొచ్చిన వలంటీర్లు, వైసీపీ నాయకులు తమకు కనీసం భోజనం ప్యాకెట్లు కూడా సరఫరా చేయలేదని కరప మండలం వేళంగికి చెందిన పలువురు వృద్ధులు, మహిళలు వాపోయారు. సభ జరుగుతుండగానే చాలామంది బస్సులు, ఆటోల వద్దకు చేరుకుని ఇంటికి బయలుదేరేందుకు సిద్ధమయ్యారు.

బస్సుల మళ్లింపుతో ప్రయాణికుల ఇబ్బందులు

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 3: కాకినాడలో సీఎం పర్యటన సందర్భంగా 318 ఆర్టీసీ బస్సుల్లో ఇక్కడకు జనాలను తరలించేందుకు మళ్లించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 180, కాకినాడ జిల్లా నుంచి 76 ఆర్టీసీ బస్సులు సీఎం సభకు జనాలను తరలించేందుకు ఉపయోగించారు. దీంతో బుధవారం అనేకమంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



సభ జరుగుతుండగానే ఆర్టీసీ బస్సు వద్దకు చేరుకున్న మహిళలు

వృద్ధుడికి అస్వస్థత



అస్వస్థతకు గురైన వృద్ధుడు

సర్పవరం జంక్షన్, జనవరి 3: కాకినాడలో సీఎం జగన్ సామాజిక పింఛన్ల సభకు వచ్చిన కరపకు చెందిన వృద్ధుడు రామారావు అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోవడం కలకలం రేపింది. కాకినాడ రూరల్ నియోజకవర్గం కరపకు చెందిన రామారావు వృద్ధుడు. అతడికి సామాజిక పింఛన్‌లో భాగంగా వృద్ధాప్య పింఛన్ వస్తోంది. సీఎం సభకు తప్పకుండా హాజరు కావాల్సిందేనంటూ వలంటీర్లు, అధికారులు అతడికి హుకూం జారీ చేశారు. లేకుంటే పింఛన్ సొమ్ము ఇవ్వడం కుదరదని స్పష్టం చేయడంతో భయంతో అనారోగ్యంతో ఉన్నా సరే అతడు బుధవారం సభకు వచ్చాడు. ఉదయం 6 గంటలకు కరప నుంచి అధికారులు సిద్ధం చేసిన బస్సులో కాకినాడ వచ్చాడు. ఉదయం 10 గంటల తర్వాత కళ్లు తిరగడంతో అస్వస్థతకు గురై సొమ్మసిల్లి పడిపోయాడు. దీంతో పక్కనున్న వారు ఆందోళనకు గురై మంచినీరు ముఖంపై చల్లి సపర్యలు చేశారు. దీంతో కోలుకున్న రామారావును వెంటనే అంబులెన్స్ ద్వారా జీజీహెచ్‌కు తరలించారు.

కలెక్టరేట్‌వద్ద బైఠాయించిన అంగన్‌వాడీలు

- భారీగా మోహరించిన పోలీసులు
- విధులకు హాజరుకావాలని అధికారులు ఇచ్చిన నోటీసులు దహనం

కాకినాడ సిటీ, జనవరి 3: అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె 23వరోజు బుధవారం భారీసంఖ్యలో అంగన్‌వాడీలు కాకినాడ కలెక్టరేట్‌వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈనెల 5న విధులకు హాజరుకావాలని అధికారులు ఇచ్చిన నోటీసులను దహనం చేశారు. సీఎం పర్యటన ఉండడంతో భారీగా పోలీసులు కలెక్టరేట్‌వద్ద మొహరించారు. విద్యుత్ ఛార్జీలు పెరుగుదలపై, నిత్యావసర వస్తువుల పెరుగుదలపై వేసిన సెటైరికల్ స్కిట్‌లు, పాటలు ఆకట్టుకున్నాయి. తొలుత సావిత్రిబాయ్ పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జీ మాట్లాడుతూ అంగన్‌వాడీల జనరల్ డిమాండ్ అయిన వేతన పెంపు చేసే వరకు సమ్మెను విరమించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. కనీస వేతనం అంగన్‌వాడీలకు రూ.26వేలు చెల్లించాలని, జగన్ ఇచ్చిన హామీలను అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నేనే సావిత్రిబాయ్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించి బాలాజీచెరువు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమణి, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు త్రిమూర్తులు, శ్రీకాంత్, ఏపీఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర కోశాధికారి దుంపల ప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ నక్కెళ్ల శ్రీను, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, సహాయ కార్యదర్శి క్రాంతి, కోశాధికారి మలకా రమణ, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు జీవీ, ధనలక్ష్మి, రాజా, నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మద్దతుగా మాట్లాడారు. కార్యక్రమానికి ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దడాల పద్మ, ఎరుబండి చంద్రావతి, కోశాధికారి రమణమ్మ, జిల్లా నాయకులు నాయకత్వం వహించారు.



కలెక్టరేట్‌వద్ద నోటీసులు దహనం చేస్తున్న అంగన్‌వాడీలు



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల

కోస్తా తీరప్రాంత అభివృద్ధికి కృషి

- కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 3: మత్స్యకారుల ఆర్థిక జీవన స్థితిగతుల్లో మార్పు తీసుకురావడంతోపాటు కోస్తా తీరప్రాంత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే దేశంలోని మత్స్యప్రాంతాలను పర్యటిస్తూ మత్స్యకారులతో మమేకం అవుతున్నట్లు కేంద్రమంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. కాకినాడ పోర్టు ఆధునికీకరణకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను అధ్యయనం చేసి అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. సాగర్ పరిక్రమ కార్యక్రమంలో భాగంగా నూరుశాతం మత్స్యకారులకు కేసీసీ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. కాకినాడ తీరప్రాంతం కోతకు గురికాకుండా చర్యలు చేపట్టడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి మత్స్యకారులకు గృహాలు నిర్మిస్తామన్నారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురగన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సముద్ర చేపలు, తీరప్రాంత గ్రామాల అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమం లక్ష్యంగా సాగర్ పరిక్రమ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్రమంత్రి శీధిరి అప్పలరాజు, ఎంపీ వంగా గీత, జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ ఎస్.సూర్యప్రకాశ్‌రావు, మత్స్యశాఖ జేడీ పీవీ సత్యనారాయణ, విజయవాడ మెరైన్ జేడీ డాక్టర్ వి.వెంకటరావు, బీజేపీ జిల్లా అధ్యక్షులడు చిలుకూరి రామ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాజు పాల్గొన్నారు.

జీఎన్‌ఎం పరీక్షలు ప్రారంభం

జీజీహెచ్(కాకినాడ), జనవరి 3: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ(జీఎన్‌ఎం) వార్షిక పరీక్షలు బుధవారం కాకినాడ రంగరాయ వైద్యకళాశాల ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యాకుమారి పర్యవేక్షణలో జరిగిన ఈ పరీక్షలు మొదటిరోజు బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జీఎన్‌ఎం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు బయోలాజికల్ సైన్స్ పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 1630మంది హాజరు కావాల్సి ఉండగా 1400మంది హాజరయ్యారు. 230మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2గంటల నుంచి 5 గంటల వరకు తృతీయ సంవత్సరం విద్యార్థులకు జరిగిన మిడ్ వైఫరీ పరీక్షకు 670మంది హాజరుకాగా 80మంది గైర్హాజరయ్యారు. గురువారం జీఎన్‌ఎం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష జరగనున్నట్లు డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు.

సంక్రాంతికి ఆర్టీసీ సన్నద్ధం


ప్రయాణికులతో రద్దీగా ఉన్న రాజమహేంద్రవరం బస్ కాంప్లెక్స్

హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికులపైనే ప్రధాన దృష్టి

స్పెషల్ బస్సులు 68, షెడ్యూల్ బస్సులు 11

10వ తేదీ నుంచి 'హైదరాబాద్ ఆపరేషన్' ప్రారంభం

స్పెషల్ బస్సుల్లోనూ సాధారణ చార్జీలే

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 3: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. హైదరాబాద్‌తో పాటు విశాఖపట్నం, విజయవాడ రూట్లలోనూ ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రధానంగా, హైదరాబాద్ నుంచి వచ్చే పండగ ప్రయాణికులపైనే జిల్లా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇప్పటి వరకూ నిర్ణయించిన ప్రకారం ఈనెల 10, 11, 12, 13 తేదీల్లో హైదరాబాద్ నుంచి జిల్లాకు మొత్తం 79 సర్వీసులు నడుపుతారు. జిల్లాలోని రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు నాలుగు డిపోల నుంచి 68 స్పెషల్ సర్వీసులు హైదరాబాద్‌కు నడుపుతారు. రాజమహేంద్రవరం డిపో నుంచి 42, గోకవరం డిపో నుంచి 16, నిడదవోలు డిపో నుంచి 3, కొవ్వూరు డిపో నుంచి 7 స్పెషల్ బస్సులు నడపనున్నారు. ఈ స్పెషల్స్‌కు అదనంగా రెగ్యులర్‌గా వెళ్లే మరో 11 షెడ్యూలు బస్సులు నడుస్తాయి. ఇలా మొత్తం 79 సర్వీసులను హైదరాబాద్‌కు తిప్పడానికి చర్యలు చేపట్టారు. పెద్ద పండుగ ముగించుకుని తిరిగి వెళ్లే ప్రయాణికుల కోసం కూడా స్పెషల్ బస్సులు నడపాలని భావిస్తున్నా ముందుగా హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణికులు టార్గెట్‌గా స్పెషల్ బస్సులను సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉంటే, విజయవాడ, విశాఖపట్నం రూట్లలోనూ స్పెషల్ బస్సులు నడపాలని అధికారులు యోచిస్తున్నారు. పండక్కి ఒకటి, రెండు రోజుల ముందు నుంచి ఈ రెండు రూట్లలో స్పెషల్ సర్వీసులు నడిపితే చాలనే అభిప్రాయం ఉంది.

రష్ బాగుంది.. టిక్కెట్లున్నాయి ...

పెద్ద పండుగ రోజుల్లో హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణికులు భారీ సంఖ్యలో ఉంటారు. దీంతో సాధారణంగా ప్రతి ఏటా ఆర్టీసీ సర్వీసులకు మంచి ఆదరణ ఉంటుంది. దీనికితోడు ఈ ఏడాది స్పెషల్ సర్వీసుల్లోనూ సాధారణ చార్జీలు మాత్రమే వసూలు చేయడంతో ఆర్టీసీ బస్సులకు మంచి డిమాండ్ నెలకొంది. ప్రస్తుతం ముందస్తు రిజర్వేషన్లు జోరుగా జరుగుతున్నాయి. రష్ బాగుందని, అయితే టిక్కెట్లు దొరకని పరిస్థితి లేదని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే అన్ని బస్సుల్లోనూ దాదాపు 70 శాతానికి పైగా రిజర్వేషన్లు పూర్తయ్యాయని, ఇంకా టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడిస్తున్నారు.

అవసరమైతే మరిన్ని స్పెషల్ బస్సులు:

ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిళా అశోక



పెద్ద పండుగ సందర్భంగా జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడుపుతున్నాం అని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిళా అశోక తెలిపారు. స్పెషల్ సర్వీసుల్లోనూ సాధారణ చార్జీలే వసూలు చేస్తామన్నారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం అదనంగా స్పెషల్ సర్వీసులు పెంచామన్నారు. పండగ ముందు 68 స్పెషల్స్ ఒక్క హైదరాబాద్‌కు పంపుతున్నామని తెలిపారు. పండుగ తర్వాత మరిన్ని స్పెషల్స్ ఉంటాయన్నారు. ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి స్పెషల్ సర్వీసులు మరిన్ని నడిపేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

దేశ ప్రగతికి మత్స్య సంపద దోహదం

కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల


మినీ ఫిషింగ్ హార్బరులో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పురుషోత్తం

అంతర్వేది, జనవరి 3: మత్స్య సంపద దేశ ప్రగతికి దోహద పడుతుందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బరులో ఏర్పాటు చేసిన సాగర్ పరిక్రమ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల కోసం ఉభయ గోదావరి జిల్లాలు, కోనసీమ జిల్లాలో స్వచ్ఛందంగా మత్స్యకారులను కలుస్తానని తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధికి, వారి ఆర్థిక పరిస్థితి మెరుగు పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. మోదీ హయాంలోనే కేంద్రంలో మత్స్యశాఖను గుర్తించి మంత్రి పదవితో పాటు మత్స్యకార అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. సాగర్ పరిక్రమ కార్యక్రమంలో 382 కేసీసీ కార్డులు పంపిణీ చేసినట్టు తెలిపారు. సుమారు కోటి 16 లక్షల మత్స్యకారులు లబ్ధి పొందారన్నారు. మత్స్యకార, ట్రేడర్ అసోసియేషన్ వంటి మత్స్యకార విభాగాలపై కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దీనిలో భాగంగా రూ.20 లక్షలతో మోటూరి సూర్యకిరణ్‌కు ట్రేడర్ వెహికల్ సబ్సిడీతో అందించారు. రూ.32 కోట్లతో మినీ హార్బరు నిర్మించి తీర ప్రాంత మత్స్యకారులకు ఉపాధి కల్పనతో పాటు మత్స్యసంపద వివిధ దేశాలకు తరలి వెళుతుందన్నారు. సమావేశం అనంతరం పలువురు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సుహూర్‌అజయ్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఫిషరీస్ జాయింట్ సెక్రటరీ నీతూకుమారిప్రసాద్, ఎన్‌ఎఫ్‌డీబీ సీఈవో ఎల్ఎం మూర్తి, ఆర్డీవో కేశవర్ధనరెడ్డి, ఫిషరీష్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జేడీ ఆనందరావు, ఏడీ వర్ధన్, ఎఫ్‌డీవో వెంకటరమణ, సీఐ గోవిందరాజు, ఎస్ఐ ఎస్.రాము పాల్గొన్నారు.

ఆలయంలో కేంద్ర మంత్రి పురుషోత్తం పూజలు

అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మత్స్య, పశుసంవర్ధకశాఖ కేంద్ర మంత్రి రూపాల పురుషోత్తం బుధవారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆయనకు అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారి అంతరాలయంలో దర్శనం అనంతరం వేద పండితుల ఆశీర్వచనం పొందారు. అనంతరం ఆలయ ఏసీ వి.సత్యనారాయణ కేంద్ర మంత్రికి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ నీతూకుమారిప్రసాద్, ఓఎస్డీ తివారీ, ధార్మిక పరిషత్ మెంబర్ విశ్వనాథరాజు, ఆర్డీవో జి.కేశవవర్ధనరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి



తుని రూరల్, జనవరి 3: 16వ నెంబరు జాతీయ రహదారిని ఆనుకుని తేటగుంట శివారు రాజుల కొత్తూరులో ఓ మహిళ అపస్మారక స్థితిలో ఉండటం గమనించిన స్థానికులు వీఆర్వో, పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందజేశారు. అయితే చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్టు ఎస్ఐ విజయ్‌బాబు తెలిపారు. మృతురాలి వివరాలు తెలియరాలేదని, సంబంధించిన వారు ఉంటే తుని రూరల్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

గుర్తు తెలియని రైలు ఢీకొని వృద్ధురాలి మృతి



తుని రైల్వేస్టేషన్ పరిధిలో రైలు ఢీ కొని వృద్ధురాలు మృతి చెందింది. గొల్లపోలు రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు 50 ఏళ్ల వృద్ధురాలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని తీవ్ర గాయాలతో పడి ఉంది. దీంతో రైల్వేస్టాఫ్ కాకినాడ జీజీహెచ్‌కు తరలించి వైద్య చికిత్స అందించారు. చికిత్స పొందుతూ వృద్ధురాలు మరణించినట్టు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. వివరాలు తెలియరాలేదని, ఆమెకు సంబంధించిన వారు తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

జనం లేక జగన్ సభ వెలవెల

కాకినాడలో సీఎం జగన్ సామాజిక పింఛన్ల పెంపు సభ

సీఎం ప్రసంగం సమయంలోనే వెళ్లిపోయిన జనం


సభ నుంచి వెనక్కి వెళ్లిపోతున్న జనం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి): కాకినాడలో బుధవారం సీఎం జగన్ సభ జనం లేక వెలవెల బోయింది. సభకు వచ్చినవారంతా మధ్యలోనే వెళ్లిపోవడంతో వైసీపీకి పెద్ద షాక్ తగిలింది. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో జనాన్ని తరలించినా సామాజిక పింఛన్ల పెంపు సభా ప్రాంగణానికి బస్సులు, ఆటోల్లో కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ మైదానానికి అధికారులు తరలించారు. ఉదయం 6 గంటలకే జనాన్ని లోపల కూర్చోబెట్టారు. తీరా మధ్యాహ్నం 12గంటలకు సీఎం జగన్ సభకు వచ్చారు. రూ.3 వేల సామాజిక పింఛన్లకు సంబంధించి రూ.1,968 కోట్ల నిధులను విడుదల చేసిన తర్వాత 12.30కు జగన్ ప్రసంగించారు. ఈ సమయంలో ఒక్కసారిగా అందరూ లేచి వెళ్లిపోయారు. పోలీసులు, అధికారులు అడ్డంగా నిలబడి జనాలను నిలువరించే ప్రయత్నం చేశారు. కానీ ఎవరూ ఆగలేదు. నెట్టుకుంటూ బయటకు వెళ్లిపోయారు. కొందరైతే బారికేడ్లు దూకేసి జంపయిపోయారు. జనం వెళ్లిపోవడంతో కంగుతిన్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి తన మనుషులతో వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. బయటకు వెళ్లేదారులను మూసేశారు. అయినా ఎవరూ వినిపించుకోలేదు. దీంతో సీఎం జగన్ ఒకపక్క ప్రసంగిస్తుండగానే సభలో కుర్చీలన్నీ ఖాళీ అయిపోయాయి.

నిలకడగా విద్యార్థుల ఆరోగ్యం

చింతూరు, జనవరి 3 : ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థినుల్లో ఇంకా 38 మంది ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. చింతూరు మండలం, బొడ్డుగూడెం ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 43 మంది విద్యార్థినులు మంగళవారం ఫుడ్ పాయిజన్‌కు గురైన విషయం విదితమే. దీంతో వారందరికి చికిత్స అందించే క్రమంలో చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారిలో కోలుకున్న ఐదుగురు విద్యార్థులను బుధవారం డిశ్చార్జి చేశారు. ఇంకా 38 మంది విద్యార్థులు ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు. వారిలో మరో ఐదుగురుని కూడా డిశ్చార్జి చేస్తామని, మిగిలిన వారి పరిస్థితి నిలకడగా ఉందని, ఆందోళన అవసరం లేదని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.పుల్లయ్య ఆంధ్రజ్యోతికి తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి పరిస్థితి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. కూరగా వండిన చికెన్ లేదా, సరిగా ఉడకని అన్నం కారణంగా ఈ సమస్య తలెత్తి ఉండవచ్చన్న ప్రాథమిక అభిప్రాయానికి వైద్యులు వచ్చినట్లు డా.పుల్లయ్య పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇ.జాన్‌రాజు బుధవారం ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకూడదని ఆయన అక్కడి ఉపాధ్యాయులను హెచ్చరించారు.

నేటి నుంచి గైట్‌లో చతుర్వేద మహాయాగం

అంతర్జాతీయ తెలుగు మహాసభలకు ఏర్పాట్లు పూర్తి


సిద్ధమవుతున్న వేదిక

రాజానగరం, జనవరి 3: లోక కల్యాణం, విశ్వశాంతి కోరుతూ తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)ఆధ్వర్యంలో గైట్ కళాశాల ప్రాంగణంలో గురువారం నుంచి చతుర్వేద మహాయాగం ప్రారంభమవుతున్నట్టు చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) బుధవారం తెలిపారు. 4వ నుంచి 8వ తేదీ వరకు వేద మంత్రోచ్చరణతో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. చతుర్వేదాల్లోని విజ్ఞానాన్ని సామాన్య ప్రజలకు సైతం అందించాలనేదే యాగం ముఖ్యోద్దేశమన్నారు. యాగశాల ప్రాంగణంలోనే గోశాలతో పాటు మన రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయ నమూనా ఆలయాలు, ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి ఆయా దేవస్థానాల అర్చకులు, వేద పండితులతో ఆశీర్వచనం, ప్రసాదాల వితరణ ఉంటుందన్నారు.

నిత్య పూజలు...

శ్రీవారి వైభవోత్సవంలో భాగంగా నేటి నుంచి తిరుపతిలో నిత్యం జరిగే మాదిరిగా ఐదు రోజులపాటు స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, కొలువు, సహస్రనామార్చన, పంచాంగం శ్రవణం, నివేదనం, శుక్రవారాభిషేకం, తిరుప్పావ సేవ, శ్రీవారి కల్యాణోత్సవం, గరుడసేవ, ఏకాంతసేవ, నివేదన కైంకర్యాలను వేద పండితులు నిర్వహించనున్నారు.

రేపటి నుంచి అంతర్జాతీయ తెలుగు మహాసభలు

చైతన్య విద్యాసంస్థలు, ఆంధ్ర సారస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో గైట్ ప్రాంగణంలో ఈ నెల 5వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ తెలుగు మహా సభల నిర్వహణకు ఏర్పాట్లు దాదాపు పూర్తయినట్టు చైతన్యరాజు తెలిపారు. శ్రీరాజరాజ నరేంద్రుడి పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలు నీరాజనంగా నన్నయ భట్టారకుని మహా భారతం వెయ్యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగే మహాసభలకు గైట్ ప్రాంగణంలో మూడు వేదికలు సిద్ధం చేశామన్నారు. ఐదు రాష్ట్రాలకు సంబంధించిన గవర్నర్లు, కేంద్ర మంత్రులు, పలువురు న్యాయమూర్తులు, సినీరంగ ప్రముఖులు హాజరవుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చైతన్యరాజు పిలుపునిచ్చారు.

పవన్ పర్యటన వాయిదా

కాకినాడ సిటీ, జనవరి 3: ఈ నెల 4, 5 తేదీల్లో జరగాల్సిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కాకినాడ పర్యటన వాయిదా పడింది. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నియోజకవర్గ సమీక్షల నేపథ్యంలో ఇక్కడి మలి విడత పర్యటన వాయిదా పడినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల మూడురోజులు పవన్‌కల్యాణ్ కాకినాడలో బస చేసి పార్టీ నాయకులతో సమీక్షలు జరిపారు. ఆ సమయంలోనే 4, 5 తేదీల్లో కాకినాడలో పర్యటిస్తారని ప్రచారం జరిగింది. తదుపరి ఎప్పుడు పవన్ పర్యటన ఉంటుందనేది టూర్ ఖరారైన తర్వాత వెల్లడిస్తామని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం


విరాళం అందిస్తున్న శివరామసుబ్రహ్మణ్యం

ఆత్రేయపురం, జనవరి 3: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి వాడపల్లి శ్రీ వేంకటేశ్వర వాసవి నిత్యాన్నదాన ట్రస్టు తరపున చైర్మన్ శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణం రూ.10 లక్షలు విరాళాన్ని బుధవారం సమర్పించారు. స్వామివారిని దర్శించుకుని వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు స్వామివారి చిత్రపటం అందజేశారు.

వేధింపులకు రాలిన విద్యా కుసుమం

గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



పెదపూడి, జనవరి 3: ఉన్నత చదువులు చదివి అత్యున్నత శిఖరాలకు చేరి తన కుటుంబానికి అండగా నిలుస్తాడనుకున్న విద్యా కుసుమం అంతలోనే నేలరాలింది. నూరేళ్ల బంగారు భవిష్యత్ వేధింపుల కారణంగా అర్థాంతరంగా ముగిసింది. పెదపూడి మండలం అచ్యుతాపురత్రయానికి చెందిన పప్పు పోసి మణికంఠ (19) మృత్యువుతో పోరాడి మృతిచెందాడు. ఈ విషాద ఘటనకు సంబంధించి మణికంఠ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మణికంఠ కాకినాడ జిల్లాలోని ఓ ప్రముఖ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఎప్పుడు మాదిరిగానే గత నెల 27న కళాశాల బస్సులో కళాశాలకు వెళ్లాడు. వేధింపులే నిత్యకృత్యంగా మారిన కళాశాల హెచ్ఓడీ, మరో ఇద్దరు లెక్చరర్లు మణికంఠను చొక్కాకు బటన్స్ సరిగా పెట్టలేదన్న నెపంతో దూషించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మణికంఠ చనిపోవాలని అదేరోజు సాయంత్రం సుమారు 6.15 నిమిషాల సమయంలో మాధవపట్నం సమీపంలోని ఇన్‌కంట్యాక్స్ కాలనీ వద్ద గడ్డిమందు తాగి తన కుటుంబ సభ్యులకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. ఆగమేఘాలమీద కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి మెరుగైన చికిత్సకు ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మణికంఠ తుదిశ్వాస విడిచాడు. తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇంద్రపాలెం ఎస్ఐ మణికుమార్ తెలిపారు. మణికంఠ మరణవార్త తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డ ఇంతలోనే అనంతలోకాలకు వెళ్లిపోయాడని మృతుని తల్లి, తోబుట్టువులు విలపిస్తున్న తీరు అందరిని కలచివేసింది.

ఐటీడీఏ కార్యాలయం ముట్టడి


ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్వాడీలు

చింతూరు, జనవరి 3: జగన్ ప్రభుత్వంపై అంగన్వాడీలు మండిపడ్డారు. గత ఇరవై రెండు రోజులుగా తాము సమ్మె చేస్తున్నప్పటికి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వారు వాపోయారు. తమతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో మాత్రం మొండి చేయి చూపుతోందన్నారు. బుధవారం చింతూరు ఐటీడీఏను అంగన్‌వాడీలు ముట్టుడించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. విధుల్లో చేరకపోతే తొలగిస్తామని ప్రభుత్వం బెదిరింపు చర్యలకు దిగడం హేయనీయమన్నారు. ప్రభుత్వం బెదిరింపులకు తాము భయపడేది లేదని అన్నారు. ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటామన్నారు. తమకు నెలకు జీతం రూ.26 వేలు, ఇతర అలవెన్సులు చెల్లించే వరకు తమ నిరసన, సమ్మె కొనసాగుతుందన్నారు. చివరిగా తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐటీడీఏలో అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జయ, చిట్టెమ్మ, కిట్టమ్మ, నూకరత్నం, వెంకటరమణ, సత్యవతి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు రత్నగిరి మట్టి, నీరు

అన్నవరం నమూనాలయానికి వచ్చిన అయోధ్య రామరథం


సీతారాముల రథానికి స్వాగతం పలుకుతున్న దేవస్థానం అధికారులు

అన్నవరం, జనవరి 3: ఈనెలలో అయోధ్య రామాలయ ప్రారంభం వేడుకలలో సత్యదేవుడు కొలువుదీరిన రత్నగిరి మట్టిని, పవిత్ర పంపానీటిని దేవస్థానం అధికారులు అందజేశారు. మంగళవారం రాత్రి 12 గంటలకు జాతీయ రహదారిపై నమూనాలయానికి చేరుకున్న అయోధ్య రామ రథానికి దేవస్థానం పీఆర్వో దామెర కృష్ణారావు, పండితులు ఘన స్వాగతం పలికారు. రాజస్థాన్‌లో బికనూరు నుంచి డిసెంబరు 18న రామరథం బయలుదేరిందని, ఈనెల 22 నాటికి అయోధ్య రామ మందిరానికి చేరుతుందన్నారు. రాష్ట్రంలో అన్నవరం, విజయవాడ దేవస్థానాల నుంచి నీరు, మట్టిని తీసుకెళుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

హోంమంత్రిని కలిసిన ఐజీ


హోం మంత్రికి ఐజీ అశోక్‌కుమార్ శుభాకాంక్షలు

కొవ్వూరు, జనవరి 3: హోం మంత్రి తానేటి వనితను ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరు రేంజ్ డీఐజీగా పనిచేస్తూ ఐజీగా పదోన్నతి పొందిన అశోక్‌కుమార్ బుధవారం కొవ్వూరులోని క్యాంపు కార్యాలయంలో హోం మంత్రిని కలిశారు. పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఐజీ వెంట జిల్లా ఎస్పీ జగదీష్ ఉన్నారు.

చెట్టును ఢీకొన్న మోటార్ బైక్

సర్వేయర్ మృతి, మరో సర్వేయర్‌కు తీవ్ర గాయాలు


మురళీ మృతదేహం

ప్రత్తిపాడు, జనవరి 3: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామం వద్ద బుధవారం రాత్రి మోటార్‌బైక్ చెట్టును ఢీకొన్న దుర్ఘటనలో ఒక యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఏలేశ్వరం మండలం సర్వేయర్లుగా పని చేస్తున్న ఏలేశ్వరానికి చెందిన మురళి, సిరిపురం గ్రామానికి చెందిన స్వామిసతీష్ బుధవారం రాత్రి పెద్దిపాలెంలో ఒక శుభకార్యానికి హాజరై తిరిగి మోటార్‌బైక్‌పై వస్తుండగా లంపకలోవ గ్రామం వద్ద వారు నడుపుతున్న బైక్ చెట్టును ఢీకొంది. ఈ దుర్ఘటనలో మురళీ (26) అక్కడికక్కడే మృతి చెందగా స్వామి సతీష్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కాకినాడ ప్రభుత్వాపత్రికి 108 వాహనంలో తరలించారు. ఇద్దరు యువకులు సర్వేయరుగా పని చేస్తూ ప్రమాదానికి గురై ఒకరు మృతి చెందడం, మరొకరు తీవ్రంగా గాయపడంతో పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

చెత్త డంపింగ్ సమస్యను పరిష్కరించలేని మంత్రి, ఎమ్మెల్యే

సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన నాగాబత్తుల శాంతకుమారి

అంబాజీపేట, జనవరి 3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 20 వేలు పైబడి ఉన్న మాచవరం మేజర్ పంచాయతీలో ఏడాది కాలంగా చెత్త డంపింగ్ సమస్య ఉన్నప్పటికీ తమ ప్రాంతంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో జరిగిన రాష్ట్రస్థాయి సర్పంచ్‌ల సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఏపీ పంచాయతీరాజ్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో శాంతకుమారి పాల్గొని మాచవరంలో నెలకొన్న చెత్త డంపింగ్ సమస్యను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా ఉండి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించలేని దుస్థితిలో సర్పంచ్‌లు ఉన్నారన్నారు. ఈ సదస్సులో పలు సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లు శాంతకుమారి ఆంధ్రజ్యోతికి తెలిపారు.


మాట్లాడుతున్న సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు శాంతకుమారి

నేడు ఉప్పాడలో కేంద్ర మంత్రి పర్యటన

కొత్తపల్లి, జనవరి 3: కేంద్ర మత్స్యశాఖ, పశుసంరక్షణ శాఖా మంత్రి పురుషోత్తం రూపాల గురువారం ఉప్పాడలో పర్యటించనున్నారు. ఉదయం 8గంటలకు సాగర పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఉప్పాడ-అమీనబాద్ రూ.423కోట్ల వ్యయంతో నిర్మించే మినీహార్బర్ ప్రాంతంలో మత్స్యకారులతో ఏర్పాటుచేసిన ముఖాముఖిలో కేంద్రమంత్రి పాల్గొంటారని ఉప్పాడ మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రామకృష్ణ తెలియజేశారు.

పవన్ రెల్లి కులానికి దత్తపుత్రుడు : ముత్తా శశిధర్

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 3: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ని కాకినాడలోనే రెల్లి కులస్థులు దత్తత తీసుకున్నారని, అప్పటి నుంచి పేద, వెనకబడిన రెల్లి కులానికి దత్తపుత్రుడని, రజక, విశ్వబ్రాహ్మణ, కుమ్మరి కులాల వారు కూడా ఆయనను దత్తత తీసుకోవాలనుకుంటున్నారని జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ అన్నారు. కాకినాడ పర్యటనలో సీఎం జగన్ పవన్‌ను దత్తపుత్రుడు అని సంబోధించడంపై ఆయన పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ 30వేలమంది కౌలురైతులను దత్తత తీసుకుని వారికి అండగా నిలిచిన గొప్పనేత అని పేర్కొన్నారు. పవన్‌ని దత్తపుత్రుడు అని సంబోధిస్తే ప్రజలే వైసీపీకి తగిన బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో పార్టీ నగర ఉపాధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, కుమ్మరి నాయకులు, రజక, విశ్వబ్రాహ్మణ నాయకులు పాల్గొన్నారు. వైసీపీ ప్రభుత్వ అధికారంలో దోచుకో, దాచుకో అన్నరీతిగా ప్రభుత్వం పనిచేస్తుంది తప్ప మత్స్యకార సమస్యలు పట్టించుకున్న దాఖలాలు లేవని ముత్తా శశిధర్ అన్నారు. పర్లోవపేటలోని మత్స్యకార ప్రాంతంలో ఆయన పర్యటించి వారి సమస్యలు తెలుసుకున్నారు. సముద్రంలో మృతిచెందిన మత్స్యకార కుటుంబాలకు పరిహారం చెల్లింపులో, వలలు, సబ్సిడీ అంశాల్లో వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని మండిపడ్డారు.

'నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

ప్రత్తిపాడు, జనవరి 3: మిచౌంగ్ తుఫాన్ వల్ల రాష్ట్రంలో దారుణంగా నష్టపోయిన రైతాంగానికి పంట నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కవులూరి పతిరాజు డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు మున్సిబ్‌వారి రామాలయం వద్ద బుధవారం బీకేఎస్ జిల్లా ప్రతినిధుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతుల బ్యాంక్ ఖాతాల్లో ఇంకా నష్టపరిహారం జమకాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ టవర్ల కింద వరి సాగు చేపట్టి నష్టపోయిన రైతాంగాన్ని కూడా నష్టపరిహారం చెల్లించాలన్నారు. బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా, ఆకుల హరిబాబులు మాట్లాడుతూ భూముల రీ సర్వేలో జరిగిన లోపాలను సవరించాలన్నారు. సమావేశంలో కె.వీర్రాజు, ఎం.సత్యనారాయణ, బేరి రాము, పెదిరెడ్ల గంగారావు, సుబ్బారావు, రాంబాబు, వీరభద్రరావు, వరుపుల నాగేశ్వరరావు, చిలకమర్తి గంగాధర్ పాల్గొన్నారు.

'అంగన్‌వాడీలను బెదిరించడం దారుణం'

జగ్గంపేట, జనవరి 3: అంగన్‌వాడీలకు ప్రభుత్వం అల్టిమేటం జారీ చేయడం, బెదిరించడం దారుణమని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గులిపే భరత్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, పసిపిల్లలకు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడుదాం ఆంధ్రకు ఖర్చు చేసిన సొమ్ములో సగం ఇస్తే అంగన్‌వాడీల డిమాండ్ నెరవేరుతాయన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం వారి డిమాండ్లు నెరవేర్చాలని, వారు చేయకపోతే వచ్చే టీడీపీ, జనసేన ప్రభుత్వంలో తగిన న్యాయం జరుగుతుందని తెలిపారు.

11వ రోజుకు న్యాయవాదుల రిలే దీక్షలు

కాకినాడ క్రైం, జనవరి 3: ప్రజల ఆస్తులను హరించే ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని కాకినాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం 11వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో మహిళా న్యాయవాదులు మాట్లాడుతూ భూహక్కుల యాజమాన్యంలో సమూల మార్పులు చేస్తూ రెవెన్యూ అధికారులకు భూమిపై హక్కులు నిర్ధారించే అధికారం సంక్రమింపజేసిన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు పి.శ్రీదేవి, కె.దమయంతి, కె.నాగజ్యోతి, కె.శైలజ, ఉమాగౌరి, వసంత, ఉమదేవి, వరలక్ష్మి మోహనలక్ష్మి, బార్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు సయ్యద్‌సలార్, జి.మోహనమురళి, పేపకాయల రామకృష్ణ, కాళిదాసు, శ్రీవాణి, మదన్ ఉన్నారు.

పిఠాపురంలో న్యాయవాదుల నిరాహార దీక్షలు

పిఠాపురం, జనవరి 3: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు చేసే వరకూ ఆందోళన కొనసాగిస్తామని, ధర్నాలు, న్యాయవాదులు, ర్యాలీలు నిర్వహిస్తామని పిఠాపురం బార్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన సాగిస్తున్న న్యాయవాదులు బుధవారం పిఠాపురంలోని కోర్టుల వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నెలల తరబడి న్యాయవాదులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని, ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే చట్టాన్ని రద్దు చేయాల్సిందేనన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రాజారావు, కేఎస్ఆర్ భాస్కర్, ఉపాధ్యక్షుడు ఎస్ఎంఅలీ ఉన్నారు.

మానసిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య

పెదపూడి, జనవరి 3: మానసిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పెదపూడి ఎస్ఐ పి.శోభన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పెదపూడి మండలం అచ్యుతాపురత్రయానికి చెందిన చిందాడ సుకన్య, చిందాడ అరుణ్‌కుమార్‌లు భార్యభర్తలు. వారికి వివాహమై 9 ఏళ్లు అయింది. కుమారుడు, కుమార్తె జన్మించారు. గత 3 నెలలుగా సుకన్య మానసికంగా ఇబ్బంది పడుతుంది. సుకన్యకు వైద్యం చేయించే నిమిత్తం తండ్రి జొన్నకూడి మాచరరావు, భర్త అరుణ్‌కుమార్ హాస్పటల్‌కు తీసుకువెళ్లేందుకు తయారవుచుండగా సుకన్య చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఇది గ్రహించిన భర్త,తండ్రి సుకన్యను చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లగా సుకన్య (25) ఈనెల 3న మరణించింది. సుకన్య తండ్రి మాచరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.శోభన్ కుమార్ తెలిపారు.

70 లీటర్ల సారాతో నలుగురి అరెస్ట్

ప్రత్తిపాడు, జనవరి 3: కాకినాడ జిల్లా ఎస్పీ జి.సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ప్రత్తిపాడు, కిర్లంపూడి, శంఖవరం మండలంలో బుధవారం సెబ్ అధికారుల బృందం విస్తృత దాడులు నిర్వహించింది. ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామంలో 10 లీటర్ల సారాతో బోసపల్లి బాపమ్మను, కిర్లంపూడి మండలం గోనాడలో 20లీటర్ల సారాతో కర్రి వీరబాబును, శంఖవరం మండలంలో కత్తిపూడిలో 30లీటర్లసారాతో బోడపాటి గోవిందు, మరో 10లీటర్లతో ఇద్దురాజును అరెస్ట్ చేశారు. కొంతం కొత్తూరు గ్రామంలో నాటుసారా బట్టీలపై దాడి చేసి 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అదే గ్రామంలో 50లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసనకుర్తి లోవరాజు, పి.తాతీలులపై కేసులు నమోదు చేశారు. దాడుల్లో సెబ్ సీఐ పి.అశోక్, ఇన్‌స్పెక్టర్ పి.సునీల్‌కుమార్, ఇంటిలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికులకు ఇక్కట్లు

సామర్లకోట, జనవరి 3: సీఎం జగన్ బుధవారం కాకినాడ పర్యటన పురస్కరించుకుని ఆయా గ్రామాల నుంచి జనాలను తరలించే భాగంగా ఆర్టీసీ బస్సులను కేటాయించారు. దీంతో ఆయా రూట్లలో ప్రయాణించేందుకు బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఉన్న కొద్దిపాటి బస్సులను సైతం కాకినాడ కాంప్లెక్స్‌కు మామూలు రూట్‌లో కాకుండా వేరే రూట్‌కు మళ్లించడంతో తిరిగి ప్రయాణికులు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను వెతుక్కోవాల్సివచ్చింది. దీంతో తీవ్ర వ్యయభారంగా మారిందని పలువురు వాపోయారు. అధిక శాతం ఆటోలను సైతం సీఎం సభలకు తరలించడంతో ఆయా గ్రామాలకు ఆటోలలో వెళ్లేవారు అనేక అవస్థలు పడ్డారు.

ఉప్పాడ తీరంలో ఈదురు గాలులు

ఉప్పాడ (కొత్తపల్లి), జనవరి 3: వాతావరణంలో మార్పుల ప్రభావంతో ఉప్పాడ తీరంలో చల్లని ఈదురు గాలులు వీస్తున్నాయి. దీంతో సముద్ర కెరటాలు ఎగసిపడున్నాయి. చలి ప్రభావం అధికంగా ఉండడం, దానికి తోడు ఈదురు గాలులు వీయడంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. చలిమంటలు వేసుకుని చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు. బుధవారం ఈదురుగాలులు అధికంగా ఉండడంతో సముద్రంపైకి వేటకు వెళ్లిన మత్స్యకారులు మధ్యాహ్నానికి వేట ముగించి ఒడ్డుకు చేరుకున్నారు. బోట్లను లంగర్లు వేసుకొని, వలలు, ఇంజన్లను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

పంచాయతీ రాజ్ సదస్సుకు తరలిన టీడీపీ నేతలు

ప్రత్తిపాడు, జనవరి 3: పంచాయతీ రాజ్ సదస్సుకు ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభరాజా ఆధ్వర్యంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు బుధవారం మంగళగిరి తరలివెళ్లారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్న పంచాయతీ రాజ్ ఛాంబర్ సమావేశంలో సూది బూర య్య, జ్యోతుల పెదబాబు, బొదిరెడ్డి గోపి, రొంగల సత్యనారాయణ, జువ్విన తిరుపతిరావు, మిరియాల శ్రీను, తటవర్తి సుబ్బారావు, సూర్నిడి సురేష్, మంతెన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: డెవిల్, బబుల్‌గమ్, యానిమల్, హాయ్ నాన్న, ఆక్వామెన్

తిరుమల	:	డెవిల్
లక్ష్మి	:	డెవిల్
సీ అండ్‌సీ1	:	ఆక్వామెన్
సీ అండ్‌సీ2	:	సలార్
శ్రీప్రియ	:	యానిమల్
పద్మప్రియ	:	సలార్
సత్యగౌరి	:	సలార్
సూర్య 1	:	ఆక్వామెన్
సూర్య 2	:	సలార్

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ

ప్రత్తిపాడు, జనవరి 3: అయోధ్య రాముని అక్షింతలు బుధవారం మండలంలోని ధర్మవరం గ్రామంలో పంపిణీ చేశారు. స్థానిక మంగయమ్మపేట రామాలయం వద్ద అయోధ్య నుంచి తీసుకొచ్చిన శ్రీరాముడి అక్షింతలకు గత వారంరోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం నుంచి స్థానికులకు వీహెచ్‌పీ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు దొడ్డిపట్ల సోమన్నదొర, చుక్కల సత్యనారాయణ, రామకుర్తి రాజబాబు, నక్కాశ్రీను ఇంటింటికి పంపిణీ చేశారు.

సీఎం సభకు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నం

వర్మ, నాయకులను అడ్డుకున్న పోలీసులు
వారి మధ్య వాగ్వాదం
హామీలు నెరవేర్చాలంటూ ధర్నా

పిఠాపురం, జనవరి 3: ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడాన్ని నిరసిస్తూ మోటార్‌సైకిల్ ర్యాలీగా సీఎం సభకు వెళ్లాలన్న మాజీ ఎమ్మెల్యే వర్మ తదితరుల ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. వాగ్వివాదంతో ఉద్రిక్తత ఏర్పడింది. హామీలు నెరవేర్చాలంటూ ధర్నాకు దిగారు. ఏలేరు ఆధునీకరణకు నిధులు ఇస్తామంటూ గొల్లప్రోలులో జరిగిన కాపునేస్తం సభలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడాన్ని ప్రస్తావిస్తూ వినతిపత్రం అందించేందుకు కాకినాడలో సీఎం సభకు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో నాయకులు, రైతులు మోటార్‌సైకిల్ ర్యాలీగా బయలుదేరారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ పురవీధుల్లో సాగి పట్టణ పోలీసుస్టేషన్ వద్దకు చేరుకోగానే పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వర్మ, టీడీపీ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. తాము శాంతియుతంగా వినతిపత్రం అందించడానికి వెళ్తుంటే అడ్డుకోవడం ఏంటని వర్మ ప్రశ్నించారు. పోలీసుల తీరుకు నిరసనగా పిఠాపురం-సామర్లకోట రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణ రెండవ విడతకు తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రూ.160కోట్లు మంజూరు చేసి చంద్రబాబుతో శంఖుస్థాపనలు చేయించి పనులు ప్రారంభించామన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంపీ, ఎమ్మెల్యేలు ఆ పనులను రద్దు చేయించారని తెలిపారు. కాపునేస్తం సభలో ఈ పనులను ప్రారంభిస్తామని సీఎం జగన్ ఎంతో ఆర్భాటంగా ప్రకటించారని గుర్తుచేశారు. సీఎం హామీ ఇచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా పనులు ఒక్క అడుగు ముందుకు పడలేదని, కనీసం టెండర్లు కూడా పిలవలేదని తెలిపారు. తప్పుడు హామీలు ఇచ్చి జగన్ ప్రజలను మోసగించారని విమర్శించారు. హామీలను గుర్తు చేసేందుకు రైతులతో కలిసి వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. అదేవిధంగా పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల అభివృద్ధికి రూ.40కోట్లు నిధులు ఇస్తామని చెప్పి ఒక్క రూపాయి ఇవ్వలేదని తెలిపారు. తప్పుడు హామీలతో మభ్య పెట్టిన జగన్‌కు ప్రజలే తగు రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. టీడీపీ పట్టణ,మండలాధ్యక్షులు రెడ్డెం భాస్కరరావు, సకుమళ్ల గంగాధర్, ఉలవకాయల దేవేంద్రుడు, గుండ్ర సుబ్బారావు, అనిశెట్టి సత్యానందరెడ్డి, బర్ల అప్పారావు, మడికి ప్రసాద్, దేవరపల్లి రామారావు, ఎలుబండి రాజారావు, గాది రాజబాబు పాల్గొన్నారు.

సీఎం పర్యటనతో ప్రజాధనం వృథా

ప్రతి పెన్షన్‌దారుడికి రూ.18వేల చొప్పున బకాయి : మాజీ ఎమ్మెల్యే కొండబాబు



సమావేశంలో మాట్లాడుతున్న కొండబాబు

కాకినాడ సిటీ, జనవరి 3: సీఎం జగన్మోహన రెడ్డి కాకినాడ పర్యటన వల్ల రూ.2కోట్ల ప్రజాధనం వృథా అయ్యిందని, ఎన్నికల్లో ఇచ్చిన రూ.3వేలు పెన్షన్ హామీ మరో 3 నెలల్లో ఎన్నికలు వస్తాయనగా పెంచి ఈ నాలుగున్నరేళ్లలో ప్రతి పెన్షన్‌దారుడికి రూ.18వేలు చొప్పున బకాయి పడ్డారని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు విమర్శించారు. కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడలో సీఎం బహిరంగ సభకు పెన్షన్ దారులను బలవంతంగా తీసుకొచ్చారని, సీఎం కేవలం ఎన్నికల పర్యటనకు వచ్చినట్లు ఉందన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను విమర్శించేందుకు సభ పెట్టి రూ.2కోట్లు ప్రజాధనం ఖర్చు చేయడం అన్యాయమన్నారు. కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఎన్నో అన్యాయాలు, అక్రమాలు చేస్తున్నాడని, ఆయన సీటు మార్చకుండా ఎందుకు వెనకేసుకొస్తున్నారో జగన్‌రెడ్డి కారణం చెప్పాలన్నారు. కాకినాడ నగరానికి చెందిన వారికి 31వేల ఇళ్ల స్థలాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న జగన్‌రెడ్డి, చంద్రశేఖరెడ్డి ఎంతమంది ఇళ్లు కట్టుకున్నారో కూడా చెప్తే బాగుంటుందన్నారు. సమావేశంలో టీడీపీ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, నగర బీసీ విభాగం అధ్యక్షుడు వొమ్మి బాలాజీ, టీఎన్‌టీయూసీ జిల్లా, నగర అధ్యక్షులు గదుల సాయిబాబు, గుజ్జు లక్ష్మణరావు, నాయకులు బంగారు సత్యనారాయణ, మూగు రాజు పాల్గొన్నారు.

టీడీపీ,జనసేనకు 160 సీట్లు ఖాయం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి



నల్లమిల్లికి హారతి ఇస్తున్న మహిళ

పెదపూడి, జనవరి 3: టీడీపీ, జనసేన ఇంటింటి ప్రచార కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి 160 సీట్లు ఖాయమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. జీ.మామిడాడలో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికీ వెళ్లి టీడీపీ హయాంలో ఏ విధంగా అభివృద్ధి జరిగింది, వైసీపీ పాలనలో జరుగుచున్న అరాచకాలు, గూండాయిజం, ఏ విధంగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుంది ప్రజలకు వివరించారు. అరాచక పాలనతో ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. గతంలో జీ.మామిడాడలో రెండు రోజులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తే అడ్డుకోవడానికి చూశారన్నారు. జీ.మామిడాడ గ్రామాభివృద్ధిపై ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి బహిరంగ చర్చకు సిద్ధమా అని ఆయన సవాల్ విసిరారు. అభివృద్ధి,సంక్షేమాలకు ప్రజలు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జుత్తుక సూర్యకుమారి, జుత్తుక కృష్ణ, తమలంపూడి శివరామారెడ్డి, ద్వారంపూడి గోపీకృష్ణారెడ్డి, సానా శ్రీను, గంటా రాజు, చిర్రా వరప్రసాదరావు, నూని దొరబాబు, జుత్తుక సూరిబాబు టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి 100 మంది



జనసేనలో చేరిన వైసీపీ కార్యకర్తలు

ప్రత్తిపాడు, జనవరి 3: ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడి వైసీపీ నాయకుడు, మండల కాపు సంక్షేమసేన అధ్యక్షుడు పిల్లా పద్మరాజు ఆధ్వర్యంలో 100 మంది వైసీపీ కార్యకర్తలు బుధవారం వైసీపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు చినశంకర్లపూడి విచ్చేసి పిల్లా పద్మరాజుతో పాటు గ్రామ ఉపసర్పంచ్ పిల్లా లోవబాబు, పిల్లా చిన్నారావు, జలిగంపల భద్రరావు, మానూరి రమణ మరో 100 మంది కార్యకర్తలకు జనసేన కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జనసేనలోకి చేరిన వారందరికి సముచిత గుర్తింపు, ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని తమ్మయ్యబాబు తెలిపారు. వైసీపీని వీడి జనసేనలో చేరిన వారందరినీ అభినందించారు. కార్యక్రమంలో జనసేన ఏలేశ్వరం మండలాధ్యక్షుడు పెంటకోట మోహన్, ఏలూరు జనసేన నాయకుడు గళ్ళ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



ప్రత్తిపాడు: ధర్మవరంలో పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు



గండేపల్లి: సూరంపాలెంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, జనవరి 3: సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. తోటవీధిలో ఉన్న సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయం వద్ద జిల్లా వర్కింగ్‌ప్రెసిడెంట్ యల్లపు బులిరాజు, ప్రధాన కార్యదర్శి ముచ్చు అప్పలరాజు, నాయకులు ఒమ్మి గంగరాజు, మదినే నూకరాజు, నల్లమిల్లి నానాజీ, అప్పన్నబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధర్మవరంలోని ప్రతిభా పాఠశాలలో జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి దాసం శేషారావు, మహిళా ఉపాధ్యాయులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి సంఘ సంస్కర్తగా, తొలి మహిళాఉపాధ్యాయురాలుగా ఆమె అందించిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డి. సత్యనారాయణ, ఏవో పి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె తన భర్తతో కలిసి బాలికల పాఠశాలను ప్రారంభించారని తెలిపారు. ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసి నేడు మహిళలు విద్య అభ్యసించడానికి కారణం పూలే అని తెలిపారు. కార్యక్రమంలో డీన్ వి.సత్యనారాయణ, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎ.వానతి, గ్రంథాలయ విభాగాధిపతి కె.అశోక్ కుమార్, జాతీయ పర్యావరణ మిత్ర టి.గంగాధర్, కె.నాగబాబు విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గంపేట: పూలే జయంతిని పరిణయ పంక్షన్ హాల్లో ఎంపీ యూత్ వలంటీర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పులిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర దళిత సేన జాతీయ అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జెబిరాజు మాట్లాడుతూ సమాజంలో మహిళలపై వివక్షతను గ్రహించి మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఉండాలని విద్యాలయాలను పూలే స్థాపించారన్నారు. తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తుమ్మలపల్లి రమేష్ మహిళా ఉపాధ్యాయులకు సన్మాన నిర్వహించారు. ఎంపీ యూత్ వలంటీర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఇజ్జిన మల్లి వీరబాబు, దళిత ప్రజాశక్తి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు మురారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల భిక్షాటన

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రమిస్తున్న కార్మికులు

గొల్లప్రోలు, జనవరి 3: డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ భిక్షాటన చేశారు. గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయం నుంచి మండలపరిషత్ కార్యాలయం వరకూ భిక్షాటన చేసి అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఎన్నికల ముందు సీఎం జగన్ ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో సీఐటీయూ నాయకుడు కరణం విశ్వనాథం, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.సత్యవతి, సీహెచ్‌వీ రమణ, నీలపు ఏసమ్మ, రాజమోహన్, సీహెచ్‌రామారావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె ప్రారంభం

పిఠాపురం, జనవరి 3: అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను తక్షణం పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు బుధవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన శిబిరంలో డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, సాకా రామకృష్ణ, ముత్యాల అప్పారావు, లంకా ప్రసాద్, చక్కా అప్పలకొండ పాల్గొన్నారు.

సామర్లకోటలో...

సామర్లకోట, జనవరి 3: మున్సిపల్ రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ సమస్యల పరిష్కారానికి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ తెలిపారు. సామర్లకోట మున్సిపల్ కార్యలయం ఎదుట బుధవారం నుంచి వర్కర్స్ ప్రారంభించిన ధర్నా శిబిరాన్ని ప్రసాద్ తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు. సామర్లకోట యూనియన్ నాయకులు బొచ్చా శ్రీను, కె.కిషోర్, మల్లిపూడి లక్ష్మి, మిరియాల పెద్ద, చెన్నా వెంకటేశ్వర్లు, చిడతా లక్ష్మి, సింగంపల్లి అప్పారావు, బంగారు వెంకన్న, గూడుపు దుర్గాప్రసాద్, తాతపూడి శ్రీనివాసరావు, నాగళ్ళ బంగార్రాజు, చింతల లోవరాజు, అనంత్‌కుమార్ ఏఐటీయూసీ నాయకులున్నారు.

9వ రోజుకు కార్మికుల సమ్మె

పెద్దాపురం, జనవరి 3: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారానికి 9వ రోజుకు చేరుకుంది. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో భాగంగా కార్మికులు మున్సిపల్ జంక్షన్ వద్ద ఉన్న రాజశేఖరరెడ్డి విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేసి నిరసనను తెలియజేశారు. తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించేవరకూ సమ్మెను విరమించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో శివకోటి అప్పారావు, సింగంపల్లి సింహాచలం, ద్రౌపతి శ్రీను, వేలాపు శివ, సీఐటీయూ నాయకులు సిరిపురపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

దట్టమైన పొగమంచు

సామర్లకోట, జనవరి 3: సామర్లకోట పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం తెల్లవారుజాము 4 గంటల నుంచి 8 గంటల వరకూ దట్టమైన పొగమంచు, చలిగాలులతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. చలిగాలుల కారణంగా వృద్ధులు, చిన్నారులు జలుబు, జ్వరాలతో అస్వస్థతకు గురయ్యారు. సామర్లకోట మీదుగా పలు ప్రాంతాలకు ప్రధాన మార్గాలైన కెనాల్ రోడ్డు, ఏడీబీ రోడ్డు, పెద్దాపురం రోడ్డు, కాకినాడ ప్రధాన రోడ్డు, పిఠాపురం రోడ్డు, ప్రత్తిపాడు రోడ్డుల్లో రాకపోకలు సాగించిన వాహనాలు వేగం పూర్తిగా తగ్గించి హెడ్‌లైట్లు వేసి హారన్ మోగించుకుంటూ వాహనాలను దాటాల్సిన పరిస్థితి ఏర్పడింది.



సామర్లకోట ఏడీబీ రోడ్డులో పొగమంచులో రాకపోకలు

చంద్రబాబు బహిరంగ సభకు స్థల పరిశీలన



తునిలో స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

తుని రూరల్, జనవరి 3: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈనెల 10న కాకినాడ పార్లమెంట్ పరిధిలోని తునిలో నిర్వహించనున్న బహిరంగ సభ స్థలాన్ని టీడీపీ నేతలైన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు, జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, ఎస్వీఎస్ఎన్ వర్మ తుని డిగ్రీ కళాశాల ఎదురుగా గల ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం ఏ విధంగా నష్టపోయిందో, వ్యవస్థలు ఎలా నిర్వీర్యం అయ్యాయో వివరిస్తూ జిల్లా ప్రజల్లో మనోధైర్యం నింపేందుకు చంద్రబాబు ఈ సభలో ప్రసంగించనున్నట్టు తెలిపారు.

భావనారాయణస్వామి హుండీ ఆదాయం రూ.3.25 లక్షలు



హుండీలోని కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

సర్పవరం జంక్షన్, జనవరి 3: శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామికి హుండీ ద్వారా రూ.3,25,362 లక్షలు ఆదాయం వచ్చినట్టు అలయ ఈవో జొన్నాడ భీమశంకర్ తెలిపారు. మంగళవారం సర్పవరం భావనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో దేవదాయ,ధర్మదాయశాఖ కాకినాడ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్రకుమార్, ఆలయ ఛైర్మన్ పుల్ల నారాయణరావుల ఆధ్వర్యంలో హుండీల్లో నగదును లెక్కించగా రూ.3,25,362 వచ్చినట్టు తెలిపారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఆదాయం వచ్చిందన్నారు. ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు జోకా సత్తి బాబు, ఘంటసాల భద్రీనారాయణ, పుల్ల వీరవెంకట సత్యనారాయణ, పుల్ల స్వాములు, ఘంటసాల సతీష్, అయ్యన్న పాల్గొన్నారు.

తెలుగు మహాసభలకు సత్యదేవుడి ప్రచారరథం



అన్నవరం, జనవరి 3: రాజమహేంద్రవరం గైట్ కళాశాలలో ఈనెల 5నుంచి 8వరకు నిర్వహించే తెలుగు మహాసభలకు సత్యదేవుడి ప్రచారరథం బుధవారం బయల్దేరి వెళ్లింది. దేవస్థానం పీఆర్వో కృష్ణారావు ప్రచార రథానికి కొబ్బరికాయ కొట్టి సాగనంపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి మేధావులు, కవులు, ప్రముఖులు హాజరవుతారని, అన్నవరం దేవస్థానంలో జరిగే సేవలు, కైంకర్యాలు తదితరవాటిని ప్రచారరథం ద్వారా వివరిస్తారన్నారు.రథంతో పాటు ఉత్సవమూర్తులను పంపినట్టు తెలిపారు.

వరుపుల సుబ్బారావు ప్రత్యేక పూజలు

అన్నవరం, జనవరి 3: సత్యదేవుడి సన్నిధిలో బుధవారం మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు, వైసీపీ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందించగా స్వామివారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బలువు రాంబాబు, కొండపల్లి అప్పారావు, దడాల సతీష్, గంపల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

జగ్గంపేట, జనవరి 3: ఇర్రిపాకకు చెందిన గులిమి చిన్న అప్పారావు(77)పొలం పనులు ముగించుకుని ఇంటికి సైకిల్‌పై తిరిగి వస్తుండగా ఇర్రిపాక నుంచి వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ చిన అప్పారావును ఢీకొనడంతో రోడ్డుపై పడి కాళ్లు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, బంధువులు 109 వాహనంలో అప్పారావును ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి భార్య గులిమి కాంతం ఫిర్యాదుతో జగ్గంపేట ఎస్ఐ కె.నాగార్జున కేసు నమోదు చేశారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

గండేపల్లి, జనవరి 3: వ్యక్తి మృతిపై గండేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం గండేపల్లికి చెందిన పల్లా జ్యోతి తన భర్త రమణ (40) డిసెంబరు29న ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకపోవడంతో గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం మల్లేపల్లి గ్రామశివారున పోలవరం కాలువ వద్ద మట్టిదిబ్బలో రమణ శవంగా కనిపించడంతో ఏఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక కార్యకర్త రాజేంద్ర మృతి

ప్రత్తిపాడు, జనవరి 3: ఏలేశ్వరానికి చెందిన సామాజిక కార్యకర్త సుజనా రాజేంద్ర(55) బుధవారం ఆకస్మికంగా గుండెపోటుతో మృతిచెందారు. పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేసి కుటుంబీకులకు సానుభూతి వ్యక్తం చేశారు.